
# ఇదీ త్యాగమే

ముద్దంశెట్టి హనుమంతరావు




అరుణ, వుబుసుపోకకు వుద్యోగం చెయ్యడంలేదు. నిరుద్యోగ సమస్య వికృతంగా నవ్వుతున్న యీ రోజుల్లో, అవకాశం వుందని, పరపతి ప్రభావంతో ఇట్టే ఉద్యోగం సంపాదించి, వున్న డబ్బును రెట్టింపు చెయ్యాలన్న దురాశతోనూ ఉద్యోగం చెయ్యటంలేదు. ఉద్యోగం చెయ్యడం, ఆమెకి అవసరమయ్యింది. తప్పనిసరి అయ్యింది.

ఔను! తప్పనిసరే! స్కూలుఫైనల్ చదువుతున్న రోజుల్లో, తండ్రిని పోగొట్టుకున్న దురదృష్టవంతురాలు, అరుణ. తల్లి దిక్కుతోచని పరిస్థితిలో దిగాలు పడిపోతే, తనే ధైర్యాన్ని కూడదీసుకుని, తల్లిని ఓదార్చిన ధీమంతురాలు అరుణ. దీక్షతో పట్టుదలతో చదివి, స్కూల్ ఫైనల్ పాసయ్యింది. టైప్ పరీక్ష పాసై ఉద్యోగం సంపాదించుకుంది. అప్పట్నుంచీ, వారి జీవితం ఒడుదుడుకుల్లేకుండా, ఎలాగో సాగిపోతోంది.

అరుణ ఆర్థికపరిస్థితిని అంతంత మాత్రమే గాబట్టి, మిగతా యువతుల్లా రకరకాల చీరలు గట్టుకొని సీతాకోక చిలుకలా తిరగలేకపోయింది. ఆ అదృష్టానికి నోచుకోనందుకు, ఆమె బాధపడలేదు కూడాను. తన అంతస్తును మించకుండా మెలిగింది ఈ కట్టుబాట్లవల్ల, ముభావంగా ఉండటం, ఆమెకి బాగా అలవడింది. మగాళ్ళతో అంత చనువుగా మాట్లాడేది కాదు.

అరుణ, ముభావంగా వుండటం వల్లనో, ఏమో మరి—చాలామంది యువ

ళులకి ఆమెతో పరిచయం ఏర్పరుచుకోవాలన్న తహతహ ఉండేది అయితే, ధైర్యం చెయ్యలేక పోయేవారు

ఇటువంటి తహతహ ఉన్నవారిలో ఆనందరావు ఒకడు. అతడు అరుణ పనిచేస్తున్న ఆఫీసులోనే అప్పర్ డివిజన్ క్లార్కుగా పనిచేస్తున్నాడు. ఆమె అంగీకరిస్తే, వివాహం చేసుకోవాలన్న తలంపు కూడా వుందతనికి. అంచేత నే చొరవచేసి ఆమెతో పరిచయానికి నాంది పలికాడు.

అరుణ, మొహం ముడుచుకోలేదు. కోపగించుకోలేదు. సౌమ్యంగానే మాట్లాడిందతనితో. మొదట్లో ఆమెను గురించి తప్పుగా అంచనా వేసుకున్నందుకు, ఇప్పుడు చింతించాడు.

వారిద్దరి పరిచయమూ, క్రమంగా పెరిగింది. అప్పుడప్పుడూ బీచ్‌కి వెళ్ళేవారు. కాస్సేపు అక్కడే కూచుని ఏవేవో కబుర్లు చెప్పుకునేవారు. అడపాదడపా యింటి విషయాలు కూడా దొర్లుతూ వుండేవి. కొద్ది రోజులకు వాళ్ళ పరిచయం గురించి గుసగుసలు ప్రారంభమయ్యాయి ఆఫీసులో. అరుణ శ్రేయోభిలాషులు కొందరు అరుణని హెచ్చరించేసరికి తన పొరపాటుని గ్రహించుకుందామె. తను ఏదో భ్రమపడుతున్నట్టనిపించిం దామెకి

ఓ రోజు—

అరుణ, బీచ్‌లో ఆనందరావుకి కాస్తంత దూరంలో కూచుంది. ఇద్దరూ మౌనంగా కూచుని, వింత సంగీతాన్ని వినిపిస్తోన్న సముద్రంకేసి పరికిస్తున్నారు. అట్లా నిశ్శబ్దంగా కూచోవడం, ఆనందరావుకి మనోబాధనిపించింది. ఆ రోజు, అరుణ, మరీ ముభావంగా వుందెందుకో, అతనికి అర్థంకాలేదు

"ఏమిటండీ, మీరేదో ఆలోచిస్తున్నట్టున్నారు?" అన్నాడు, ఆనందరావు. వారి సంబోధనల్లో యింకా బహువచనమే దొర్లుతూ వుండటం, గమనించదగ్గ విషయం.

"ఔనండీ ఆనందరావుగారూ! నిజంగానే ఆలోచిస్తున్నాను ఆలోచించాలిసిన సమస్య ఎదురయ్యిందిగాబట్టి, ఆలోచించక తప్పడంలేదు" అంది మొహం దించుకుని, ఇసుకలో పిచ్చిగీతలు గీస్తూ.

"సమస్యా!" అదోలా ఆమెకేసి చూస్తూ అన్నాడు, ఆనందరావు.

అరుణ, చిన్నగా ఓ నిట్టూర్పు వదిలింది.

"ఔనండీ! ఇటీవల మన పరిచయం చెప్పుకోదగ్గంతగా పెరగక పోయినా, నలుగురూ గుసగుసలాడుకునేందుకు వుపయోగపడేలా మాత్రం అభివృద్ధిచెందింది ఇందులో మంచి ఏమిటో, చెడు ఏమిటో, మనం గుర్తుంచుకోలేదు. కాని, మనల్ని ఓకంట కనిపెడుతూవున్న సంఘం, మంచి చెడ్డల్ని బేరీజు వేస్తుంది. అంచేత మనం యిలా తిరగడం యికమీదట శ్రేయోదాయకం కాదేమోనని నాకు అనిపిస్తోంది" అంది అరుణ.

ఆనందరావు ఆశ్చర్యపడలేదు మెల్లగా మందహాసం చేశాడు.

"ఇదో పెద్ద సమస్యగా మీరు భావిస్తుండటం. నాకు నవ్వు తెప్పిస్తోందండీ! సంఘంలో బ్రతుకుతున్న వాళ్ళం గాబట్టి సంఘానికి భయపడాలి. కాదనను "అయితే, అటువంటి భయాన్ని దూరం చేసుకునేట్టు పరిస్థితి! సానుకూలం చేసుకుంటే పోయేదిగా!" అన్నాడు.

అరుణకి. అర్థం కాలేదు.

"అంటే? నాకేం అర్థంకాలేదు." అందామె.

"మీకు కోపగించుకోనంటే చెబుతాను."

"కోపమెందుకండీ? చెప్పండి .."

"మీకు అభ్యంతరం లేకపోతే, మనం పెళ్ళి చేసుకుందాం. నిజానికి, నేను మీతో పరిచయం చేసుకోవడం ఈ వుద్దేశంతోనే. నన్ను నిరుత్సాహ పర్చరన్న నమ్మకం వుందినాకు" ఆమె మొహంలోకి అనక్తిగా చూస్తూ అన్నాడు ఆనందరావు.

అరుణకి. హఠాత్తుగ సిగ్గు ఆవరించింది. మొహం దించుకుంది. చప్పున జవాబు చెప్పలేక పోయింది. ఔనుమరి! ఏం చెప్పాలో. అంత తొందరగా వూహాకి అందలేదు. ఆనందరావంటే, ఆమెకీ సద్భావం వుంది. అది అనురాగమే అయ్యుం డొచ్చునని ఆమె వూహా. అంచేత ఆయన్ని వివాహం చేసుకుందుకు. ఆమెకి ఎటువంటి అభ్యంతరమూ అనుపించలేదు—ఈ ఆలోచనల్లోనే వుండింక, అరుణ.

"ఏమిటండీ ఆలోచిస్తున్నారు?" అడిగాడు. ఆనందరావు.

అరుణ. ఆలోచనలనించి తేరుకుంది. "మీరు అడిగినంత సులువుగా, నేను జవాబు చెప్పలేనండీ! వివాహం చేసుకుని అందరిలా హాయిగా సంసారం చేయడం. నాకూ ఇష్టమే! కాని ...కాని ... నా చుట్టూవున్న కొన్ని సమస్యలు, ఆ అదృష్టాన్ని నాకు దూరం చేస్తున్నాయి." అని అరుణ చెబుతూవుంటే, ఆమె గొంతు జీరవోయింది. "ఇంకేం సమస్యలండీ" దిగాలు పడుతూ అన్నాడు ఆనందంరావు.

అరుణ. బరువుగా ఓ నిశ్వాసం వదిలింది. "నా జీవిత చరిత్ర. సమగ్రంగా మీకు తెలీదండీ. నా వంటి దురదృష్టవంతురాలు ఈ ప్రపంచంలో మరెవ్వరూ ఉండరేమో! నేను స్కూల్‌ఫైనల్ చదువుతున్నపుడు. మా నాన్నగారు చనిపోయారు. అమ్మ నేను. మా తమ్ముడు. అప్పటి మా సంసారం. తమ్ముడు అన్నవాడు అప్పటికి ఏదో క్లాస్ చదువుతుండేవాడు. మా సంసారం ఎట్లాసాగుతుందా అన్న బెంగ పట్టుకుంది మా అమ్మకు. ఆమె దిగులు చూసి. నాకే భయంవేసింది. పట్టుదలతో స్కూల్‌ఫైనల్ పాసయ్యాను. టైప్ నేర్చుకున్నాను. అయినా ఉద్యోగం దొరకడం కష్టమయ్యింది. మా నాన్నగారి

స్నేహితుడొకాయన సహకారంతో యీ ఉద్యోగం సంపాదించగలిగాను మా అమ్మ, తమ్ముడు, కేవలం నా ఆదాయం మీదే ఆధారపడి వున్నారు. అటువంటి పరిస్థితిలో, నా మట్టుకు నేను పెళ్ళి చేసుకుని, అత్తారింటికి వెళ్ళిపోతే, వాళ్ళ మాటేవిటి చెప్పండి. తమ్ముడి చదువు ఎట్లా సాగుతుంది? వాడు కనీసం గ్రాడ్యుయేట్ కావాలని నా అభిలాష వాడు డిగ్రీకోర్సు పూర్తి చేసేవరకూ ఆదుకోవలసింది నేనేగా! ఆ తరువాత వాడే ఏదో జీవనాధారం చూసుకుంటాడు. నేను నిశ్చింతగా వుండొచ్చు. అంతవరకూ ఇవి సమస్యలు కావంటారా?"

ఆనందరావుకి ఇప్పుడు అరుణ జీవితం సాంతం అర్థమయ్యింది. ఆమె చెప్పింది. సబబుగావున్నట్టు తోచింది

"దానికేముందండీ! మీ తమ్ముడు డిగ్రీకోర్సు చదువుకుంటాడు" అన్నాడు

"నా జీతంలో సగం, మా అమ్మకి యివ్వాలిసివుంటుంది దీనికి అంగీకరించితేనే, మన వివాహం గురించి ఆలోచించడం జరుగుతుంది ఆలోచించండి మీరు" నిష్కర్షగా చెప్పింది

"నాకేం అభ్యంతరం లేదండీ! మీ జీతంలో సగం, మీ వాళ్ళకి ఇవ్వొచ్చు" నిబ్బరంగా చెప్పాడు ఆనందరావు.

"మీరు అంగీకరించవచ్చు ...మీ తల్లిదండ్రులు కూడా ఒప్పుకోవాలిగా!"

"ఆ సందేహం మీకు అక్కర్లేదండీ! నా నిర్ణయానికి మావాళ్ళెవరూ అడ్డు చెప్పరు."

"అయితే సరే! మిమ్మల్ని పెళ్ళి చేసుకుందుకు, నాకూ అభ్యంతరంలేదు మీ వాళ్ళను తీసుకుని, ఓసారి మా యింటికి రండి పెద్దవాళ్ళు మాట్లాడుకోవడం అవసరం కదా!"

"అలాగేనండీ! మా అమ్మ, నాన్నను తీసుకుని వస్తాను. ఇవ్వాళ, నాకు ఎంతో ఆనందంగా వుందండీ!" ఉత్సాహంగా అన్నాడు ఆనందరావు.

"నాకూనండీ!" ముక్తసరిగా అంది అరుణ

క్షణం నిశ్శబ్దం

"చాలాసేపు కూచున్నాం. పోదాం, పదండి" అంది, అరుణ.

ఆనందరావూ ఆమెను అనుసరించాడు.

*    *

ఇల్లు చేరుకోగానే, తల్లితో ఆనందరావు విషయం చెప్పింది, అరుణ

తల్లి జానకమ్మ విస్తుపోయింది. "ఈ నిర్ణయానికి రావడంతో, తొందరపడ్డావేమోనమ్మా అరుణా!" దిగులుగా అంది.

"తొందరపడలేదమ్మా! నిశ్చలంగా ఆలోచించే, యీ నిర్ణయాని కొచ్చాను నాషరతుకి ఒప్పుకున్నపుడే ఈ వివాహం. కాకుంటే, వివాహం జరగదు."

"ఇప్పుడన్నీ ఒప్పుకుంటారమ్మా!




రోజులు గడిచేకొద్దీ, ఈ ఒప్పందాలేవీ గుర్తుండవు అప్పుడు మనం విచారించి, ప్రయోజనం ఉండదమ్మా" ఆమె హృదయంలో ఏవో భయాందోళనలు మెదులుతున్నట్టు, ఆమె మాటలే చెబుతున్నాయ్.

అరుణ, మెల్లగా నవ్వింది.

"నేనేం అంత తెలివి తక్కువదాన్ని కానమ్మా! వ్రాత మూలంగా వుంటాయి అన్నీను !!

'ఏం భయంలేదు అలా చూస్తూ వుండు"

జానకమ్మ ఓ నిట్టూర్పువదిలి వూరుకుంది.

* *

మూడు రోజుల తరువాత ఆనందరావు తండ్రినీ తల్లినీ తీసుకుని అరుణ ఇంటికి వెళ్ళాడు. అరుణ పెట్టిన షరతు మాత్రం వాళ్ళతో ముందుగా చెప్పలేదు. పెళ్ళి జరిగాక చెప్పొచ్చు ననుకున్నాడు.

జానకమ్మ తను ఇంటికి వచ్చిన అతిధుల్ని వుచితరీతిని గౌరవించింది.

అరుణ, ఆకర్షణీయంగా ముస్తాబై, వాళ్ళెదుటికి వచ్చి, నమస్కరించింది. ఆనందరావు తలిదండ్రులు కాబోయే తమ కోడల్నిచూసి, తృప్తిగా ఒకర్నొకరు చూసుకున్నారు. నచ్చినట్టు వాళ్ళ మొహాలే చెబుతున్నాయి

ఆనందరావు తల్లి, అరుణని తన ప్రక్కనే కూచోబెట్టుకుంది.

"మాకు పిల్ల నచ్చింది వదినగారూ! ఇక, కట్నాలూ, కానుకల విషయం మాట్లాడుకుంటే పోయె " అంది, జానకమ్మతో.

జానకమ్మ, చాలా ఇరకాటంలో పడింది. "వదినగారూ! అరుణ, తండ్రి లేనిపిల్ల. మాకేం ఆస్తిపాస్తుల్లేవు. అమ్మాయే మా ఆస్తి. అయినా, బొత్తిగా కట్నం లేకుండా పిల్లనివ్వడం, మాకూ గౌరవప్రదంగా వుండదు గాబట్టి, రెండువేలకు మించి నేను యివ్వలేను వదినగారూ!' అంది జానకమ్మ.

ఆనందరావు తల్లి ఏమీ అనలేదుగానీ

తండ్రి మాత్రం పెదవి విరిచాడు.

"రెండువేలేనా? మా వాడికి అయిదువే లిస్తామంటూ ఆ మధ్య రెండు సంబంధా లొచ్చాయండీ! మా వాడికి అమ్మాయి నచ్చక మానేశాం." అన్నాడాయన.

"మా పరిస్థితి చెప్పుకున్నాను కదా, అన్నయ్యగారూ" అంది జానకమ్మ.

కట్నాల వేలంపాట, పై స్థాయికి పోకముందే. అసలు షరతుమీద ఆమోద ముద్రపడ్డం అవసరమనుకుంది, అరుణ.

క్షమించండి. నేను కలిగించకోక తప్పడంలేదు" అంటూ లేచివెళ్ళి టేబిల్ మీద అంతకుముందు పెట్టివుంచిన టైప్ చేసిన కాగితాలు తెచ్చి, ఆనందరావు తండ్రికి అందించింది.

ఆనందరావుకి అర్థంకాలేదు, విషయ మేమిటో! అతని తండ్రికి అంతకంటే అర్థంకాలేదు.

"ఏమిటమ్మా ఈ కాగితాలు!" అన్నాడు ఆనందరావు తండ్రి. ఈ కొత్త పద్ధతి, అతనికి ఆశ్చర్యం కలిగింది.

"చదవండి మీకే బోధపడతుంది. కట్నం సమస్య పరిష్కారం కాకముందే, యీ కాగితాలపై సంతకాలు జరగడం, చాలా అవసరం" అంది మెల్లగా అరుణ.

తండ్రి ఆ కాగితాల్ని చదువుతూ వుంటే, ఆరాటం పట్టలేక, తండ్రి కుర్చీ వెనక్కిచేరి, తనూ చదివాడు ఆనంద రావు. అతనికి ముచ్చెమటలు పోశాయి. ఆమె చెప్పిన షరతుకి తాము అంగీకరిస్తు న్నట్టు ఆ కాగితాలపై సంతకాలు పెట్టాలి .కంగారు పడిపోయాడు మనిషి.

ఆనందరావు తండ్రి మొహం జేవు రించింది. అతని కనుబొమలు ముడి పడ్డాయి.

"ఏమిటమ్మా ఇదంతా? నువ్వు తెచ్చే జీతంలో సగం, ప్రతినెలా మీ అమ్మగారికి ఇస్తామని హామీ ఇస్తూ, నేను, మావాడూ, ఇక్కడ సంతకాలు పెట్టాలా? పరిహాస మనుకుంటున్నావా ఏమిటి?" కటువుగానే అన్నాడాయన.

ఆనందరావు కంగారు హెచ్చింది. అయినా ఏం మాట్లాడాలో, ఎలా పరిస్థితిని అదుపులోకి తీసుకోవాలో అతనికి అర్థం కాలేదు.

అరుణ కించిత్తయినా జంకలేదు "నా యీ షరతుని పరిహాసానికే మీ అబ్బాయి అంగీకరించారేమో, ఆయన్నే అడగండి" అంది సౌమ్యంగానే.

ఆనందరావు మొహం వ్రేలాడేశాడు.

ఆనందరావు తండ్రి, వుగ్రరూపం దాలుస్తూ, కొడుకుకేసి కొరకొరా చూశాడు.

"ఏంరా, నువ్వు అంగీకరించావా?" గర్జించాడు.

ఆనందరావు తడబడ్డాడు. అబద్ధం చెప్పి, అరుణముందు అనృతవాది కాలేడు. నిజంచెప్పి, తండ్రి ఆవేశానికి గురికాలేడు. ఏం చెయ్యాలో తోచని, అయోమయస్థితిలో పడ్డాడు. అయినా, ఏదో చెయ్యాలి.. .ఏదో చెప్పాలి.

"మరేఁ. మరేఁ...." నసిగాడు.

"మేకలా, అలా "మే" "మే" అంటావేవిఁట్రా గాడిదా? చెప్పు ఏవిఁటో" మళ్ళీ గర్జించాడు తండ్రి.

"ఆమె చెప్పింది నిజమే నాన్నా! నేను అంగీకరించాను. పెళ్ళయ్యాక, మీతో యీ విషయం చెప్పాలని వూరు కున్నాను." నేరంచేసిన వాడి లా మొహం దించుకుని చెప్పాడు.

ఆనందరావు వ్యక్తిత్వం ఏమిటో అరుణకి అర్ధమైపోయింది. మనసులో అతణ్ణి అతని పిరికితనాన్ని, అసహ్యించు కోవడం ప్రారంభించింది.

"ఉద్ధరించావు. ముదనష్టపు వెధవా! మహా స్వతంత్రుడివై పెట్టు. నీ అంగీ కారం తెలిపేశావేం? మేం చచ్చామను కున్నావా?" విసురుగా కొడుకిని చీవాట్లు పెడుతూ, అరుణకేసి తిరిగారాయన.

"చూడమ్మా, వాడేదో వ్యామోహం వల్లనో, తెలివితక్కువవల్లనో, అంగీక రించాడే అనుకో పెద్దవాళ్ళం ఎవ్వరమూ అంగీకరించకుండా వాడిమాటే చెల్లు తుందని నువ్వు అనుకోవడం కూడా పొరపాటే మరి!"

"ఆయన చెప్పిన సంగతి వేరండీ! మీ రెవ్వరూ ఆయన మాటకి అడ్డు చెప్ప రని నన్ను నమ్మించారు. అయినా సరే, నా జాగ్రత్త నేను తీసుకోడానికిగాను యీ కాగితాల్ని తయారు చెయ్యాల్సి వచ్చింది. నేనూ ఆయన మాటమీద విశ్వాసముంచి, వూరుకుంటే, మా అమ్మకీ, తమ్ముడికీ, అన్యాయం చేసిన దానినయ్యుండేదాన్ని." అంది, అరుణ తన పొరపాటేమీలేదని విశదీకరిస్తూ.

"అయితే, ఇప్పుడేమంటావ్?"

"అది, నేను చెప్పడమేవిఁటీ చెప్పండి? పెద్దయి...మీరే నిర్ణయిం చండి."

"ఎవరైనా, ఇటువంటి షరతుకి ఒప్పుకుంటారా చెప్పు? ఆడపిల్లలకు వివాహాలు జరగడమే గగనంగా వుండీ రోజుల్లో, అటువంటప్పుడు, షరతులూ, గిరతులూ, అంటే, ఎవరు ముందు కొస్తారు? నీ స్వార్ధమే నువ్వు చూసు కుంటున్నావు గాని, మాకూ ఏవో ఆశ లుంటాయి కదమ్మా!" అన్నాడు, ఆనంద రావు తండ్రి.

అరుణకి, యీమాట కొత్త చిత్రమని పించింది.

"మీరు, చాలా దారుణంగా మాట్లాడు తున్నారు. మా అవసరాన్ని స్వార్ధంగా గుర్తించి, మీ స్వార్ధాన్ని ఆశలంటూ పేర్కొనడం అన్యాయం. నేను తెచ్చే జీతపురాళ్ళు లేకపోయినా, మీ కుటుంబం జీవించగలదు కాని, మా విషయం అది కాదు. మా అమ్మ, తమ్ముడికీ మరో ఆధారంలేదు. వారిని ఆదుకోవడం, నా స్వార్ధంకాదండీ! అది నా కర్తవ్యం!" నిబ్బరంగా అంది.

"అదీ నీ కర్తవ్యమనుకుంటే యీ వివాహానికి మేం అంగీకరించలేమమ్మా!" అన్నాడు ఆనందరావు తండ్రి.

అరుణ, పొడిగా నవ్వింది. ఆ నవ్వులో కసి తొంగి చూస్తోంది.

మీరు అంగీకరించకపోతే మేం కూడా విచారించమండీ! ఇది మీరు గ్రహించాలి. ఈ వివాహ ప్రయత్నానికి నాందిగీతం పాడింది, మీ అబ్బాయి. ఈ విజాన్ని

మీరు తెలుసుకోవడం, చాలా అవసరం. నా స్వార్థమన్నారే—నిజంగా నేను కోరుకునేది అదే అయితే. ఏ షరతులూ మీ ముందు వుంచకుండా, సంతోషంతో యీ వివాహానికి అంగీకరించివుండేదాన్ని. నామట్టుకు నేను సుఖంగా కాలం గడిపేదాన్ని కాని అటువంటి స్వార్థానికి అలవాటుపడలేదు మేం మాకు తెలిసిందంతా మా కర్తవ్యం మేం నిర్వర్తించడమే!" హృదయం దహించుకు పోతూవుంటే, క్రోధంతో చెప్పుకుపోయింది అరుణ

"అబ్బో! చాలా పెద్దమాటలు చెబుతున్నావే!" వెటకారంగా అన్నాడు ఆనందరావు తండ్రి

"ఔనండీ! చెప్పడమే కాదు—చెప్పిన దాన్ని ఆచరించడం మాకు అలవాటు. ఆచరించే ధైర్యం లేకపోయినా, కేవలం మాటలు చెప్పే పిరికివాళ్ళం కాదు" అంది.

ఆనందరావు, వింగితుడిలా మొహం దించుకున్నాడు. అరుణ దృక్పథంలో, తను బాగా దిగజారి పోయాడన్న బాధ, అతణ్ణి మరీ కృంగదీసింది.

ఆనందరావు తండ్రి. మరేం మాట్లాడలేక పోయాడు. కొడుక్కేసి చురచురా చూశాడు

"పదరా వెధవా! నీ మూలంగా అవమానించబడ్డాం" అంటూ లేచాడు

"మీ చేతిలోవున్న ఆ కాగితాల్ని యిలా యివ్వండి ఇంక, వాటి అవసరం లేదుగా" అంది అరుణ

ఆయన ఆ కాగితాల్ని అందిస్తే, వాటిని కసిగా, ముక్కముక్కలుగా చేసి, కిటికీగుండా బైటికి విసిరేసింది అరుణ.

ఆనందరావు మనస్సు, కలుక్కుమంది. కాని, ఏం చెయ్యగలడు!

ఆనందరావు తండ్రీ, తల్లీ, చరచరా బైటికి నిష్క్రమించారు. ఆనందరావూ వారిని అనుసరించాడు. అవనత ముఖుడై కనీసం వెనుదిరిగి చూడ్డానికయినా ధైర్యం చాల్లేదతనికి.

జానకమ్మ ఓ నిట్టూర్పు విడిచి అంది.

"అమ్మా అరుణా, ఇది, నీ దురదృష్టమమ్మా" కంట తడిపెట్టుకుంటూ అంది

అరుణ, నిశ్చలంగా మందహాసం చేసింది "కాదమ్మా! ఇది నా అదృష్టం నువ్వు కంట తడిపెట్టుకోడం. నాకు నచ్చలేదు నా కర్తవ్యం, నాకు తెలుసునమ్మా! నా కర్తవ్య నిర్వహణలో, నా సుఖాల్ని త్యజించడానికి నేనెప్పుడూ సిద్ధమే!"

"నువ్వు త్యాగమూర్తి వమ్మా!" కూతురి తల నిమురుతూ అంది జానకమ్మ.

"ఆమాటే అనొద్దన్నానమ్మా! ఇందులో నేను చేసిన త్యాగం ఏమీ లేదు. నా బాధ్యత తీర్చుకుంటున్నాను నా విధిని నేను నిర్వర్తించుకుంటున్నాను అందుకనే నాకు తృప్తి, మనశ్శాంతి లభిసాయి" అంది అరుణ సంతోషంతో.

జానకమ్మ, కూతుర్ని చూసి గర్వించింది తృప్తిగా నిట్టూర్పు వదిలి, అక్కణ్ణించి వెళ్ళిపోయింది

అరుణ కిటికీ దగ్గరికొచ్చి నుంచుంది. తను విసిరేసిన కాగితమ్ముక్కలు, చిందరవందరగా ఎగురుతున్నాయ్. నవ్వుకుందామె.